
# స్మగ్లర్స్ గాంగ్



"కార్ల్‌మార్క్స్ జిందాబాద్! కామ్రేడ్ శాయీరామ్ జిందాబాద్!"

కేకలు దగ్గరయాక చూస్తే– వాళ్ళంతా మా కాలనీ కుర్రాళ్ళే!

వాళ్ళందరూ మార్క్సిస్ట్ (ఎక్స్ట్రీమ్, లెనినిస్ట్ మీడియమ్ గ్రూప్) ఇది మా కాలనీలో కొత్తగా ప్రారంభించిన కమ్యూనిస్ట్ పార్టీ! ఎవరికిష్టమొచ్చిన పార్టీవాళ్ళు స్థాపించుకునే సాంప్రదాయం మనకెలాగూ ఉండనే ఉంది కదా! ఇప్పుడు సంగతేమిటంటే మా కాలనీ వాళ్ళు తీయబోయే సినిమా కేవలం మార్క్సిస్ట్ భావాలతో విప్లవాత్మకంగా తీయాలని వాళ్ళు డిమాండ్ చేస్తూ ఊరేగింపు జరిపారన్నమాట.

సంగతేమిటో కనుక్కుందామని శాయీరామ్ ఇంటికెళ్ళేసరికి అందరూ అక్కడే సమావేశమయి కనిపించారు.

"మరేంలేదు. మార్క్సిస్ట్ భావాలతో సినిమా తీయాలని వప్పుకునేసరికి "నాకే" జైకొట్టేస్తున్నారు" చిరునవ్వుతో చెప్తున్నాడు శాయీరామ్.

"అదేమిటి మనం మొదటి సినిమా పూర్తిగా కమర్షియల్ మసాలాతో వ్యాపార చిత్రం తీయాలనుకున్నాం గదా?" అడిగాడు జనార్ధన్.

"అందుకేనయ్యా బాబూ... మార్క్సిస్ట్ వ్యవహారంతో సినిమా తీయటం! ఈ రోజుల్లో అవే వ్యాపార చిత్రాలు! ఆ మషాలా పెట్టి, మిగతా మషాలాలు కొంచెం తగిలిస్తే చాలు!" అన్నాడు శాయీరామ్.

"అవునవును!" అంది పార్వతీదేవి.

"కానీ మార్క్సిస్ట్ సినిమా ఎలా తీయాలో మనకెలా తెలుస్తుంది?" అనుమానంగా అడిగాడు రంగారెడ్డి.

"నాకు తెలుసు నేను చెప్తానులే!" అన్నాడు జనార్ధన్.

జనార్ధన్ వాళ్ళ అన్నయ్యకు ఆ మధ్య వ్యాపారంలో లక్షలు లక్షలు లాభం వచ్చేసరికి ఆ కుటుంబమంతా మార్క్సిస్ట్‌లతో చేరిపోయారు.

మార్క్సిస్ట్ నాయకులవాలంటే లక్షలకు లక్షల ఆస్తి ఉండాలంట! కాదని మేమెంత చెప్పినా వినిపించుకోలేదు. కావాలంటే మన రాష్ట్రంలోని కమ్యూనిస్టు మార్క్సిస్టు పార్టీల నాయకులు ఆస్తి వివరాలు కనుక్కోమంటాడు.

"మరి దీనికి కథెవరు తయారు చేస్తారు?" అడిగాను నేను.

"ఇంకెవరు? నేనే! ఎలాంటి కథయినా రాయగలను నేను" అన్నాడు చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఉరఫ్ రామసుబ్బయ్య.

"నువ్వా! నీకసలు మార్క్సిజం అంటేనే తెలీదుకదయ్యా?" అడిగాను చిరాకుగా

"భలేవారే సార్! మార్క్సిజం సినిమా తీయడానికి మార్క్సిజం అంటే ఏమిటో తెలియాలా? భలేవారే సార్! విమానం ఎక్కడానికి విమానం డ్రైవింగ్ తెలుసుండాలా? భలేవారే సార్ మీరు" అందరూ నన్ను చూసి నవ్వారు.

"అయితే ఓ వారంలో కథ తయారుచెయ్! లాగించేద్దాం!" అన్నాడు శాయీరామ్.

చంద్రకాంత్ ఛటోపాధ్యాయ్ ఆనందంగా కాగితాలు కలం తీసుకుని వెళ్ళిపోయాడు. ఆ వారమంతా సినిమా వ్యవహారంలో బిజీ అయిపోయే వాళ్ళేమో గానీ ఈలోగా, మా కాలనీ పిల్లలందరూ చదువుతోన్న స్కూల్ తాలూకూ ప్రిన్సిపాల్‌గారి దగ్గర్నుంచీ మా అందరకూ ఉత్తరాలు వచ్చాయ్. అన్నిట్లోనూ మేటర్ ఒక్కటే.

"మీ పిల్ల పిల్లగాడు... కి టి.సి. ఇచ్చి స్కూలు నుంచి గెంటేయాలని ఆలోచిస్తున్నాము. ఆ విషయంలో మీ సహకారం కోసం అర్థిస్తూ–

– ప్రేమతో మీ ప్రిన్సిపాల్

పిడుగుపడ్డట్టు అందరం స్కూలుకి పరుగెత్తాం పిల్లకాయలను వెంట బెట్టుకుని. అప్పటికే అక్కడ ఓ జాతరలాగుంది తల్లిదండ్రులూ, పిల్లలతో ! ప్రిన్సిపాల్ రూమ్ బయట అప్పుడప్పుడూ పిల్లల్ని మింగేసేలా చూస్తూ తల్లిదండ్రులు నిలబడి ఉన్నారు.

రంగారెడ్డి చాలామందిని ఇంటర్వ్యూ చేసి వచ్చాడు.

"అందరికీ అవే ఉత్తరాలు వచ్చాయట. ఇప్పటికిప్పుడే ఇద్దరు పిల్లలకి టి.సి. ఇచ్చి పంపిచేసిందట కూడాను" వివరాలు చెప్పాడు మాకు. ఈలోగా ప్రిన్సిపాల్ రూమ్‌లో నుంచి ఓ తండ్రి గొంతు గట్టిగా బ్రతిమాలుతూ వినిపించింది.

"అలా అనకండి మేడమ్! ప్లీజ్ మేడమ్! ఇప్పుడు టి.సి. ఇస్తే సీటెక్కడ దొరుకుతుంది మేడమ్."

"లేకపోతే ఏమిటది? ఏమిటి చదువు? ఏమిటీ మార్కులు? మాత్స్– ట్వంటీ పర్సెంట్ సైన్స్ ఫిఫ్టీన్ పర్సెంట్! నో ! నో! టి.సి. తీసుకెళ్ళిపోండి! పిల్లల చదువు మీద శ్రద్ధలేని తల్లిదండ్రులు మాకక్కర్లేదు– మా స్కూల్లో "సీటు" కు ఎంత డిమాండ్ ఉందో తెలుసా మీకు?"

"తెలుసండీ!"

"సీటు" ఇస్తాను అంటే చాలు! వేలకువేలు డొనేషన్లు కట్టే పేరెంట్స్ వేలకు వేలున్నార్న సంగతి తెలుసా మీకు?"

"తెలుసండీ!"

"తెలిసే ఇంత నిర్లక్ష్యం అన్నమాట! తీసుకుపోండి!".

"క్షమించండి మేడమ్– ఈసారికి క్షమించండి! వచ్చే పరీక్షలకులకు ముందు నేనే శెలవుపెట్టి బాగా చదివి మా పిల్లలక్కూడా చెప్పి మంచి మార్కులు వచ్చేలాచేస్తా!"

"ఇప్పటి పరీక్షల సంగతి మాట్లాడు! ఇప్పుడెందుకు మంచిమార్కులు రాలేదు?"

"నాదే బుద్ధి తక్కువండీ! చాలా పొరపాటు చేశాను."

"అవునా? ఇంక నోర్మూసుకుని టి.సి. తీసుకెళ్ళండి!"

"బాబోయ్ అంతమాట అనకండి మేడమ్– టెక్ట్స్ పుస్తకాలు లేకపోవటంవల్ల ఆ రెండింటిలో తప్పారండి...."

"టెక్ట్స పుస్తకాలెందుకు లేవు?"

"ఏమో మేడమ్! అడ్డమయినా షాపులూ తిరిగాను. ఇంతవరకూ ఎక్కడా రాలేదంటున్నారు–"

"పిచ్చివాగుడు వాగకూడదు! క్లాస్‌టీచర్ దగ్గర ఒక టెక్ట్సపుస్తకం నేను చూశాను. ఇంతవరకూ రాకపోతే క్లాస్‌టీచర్ దగ్గరకెలావచ్చాయ్?"

"ఆవిడ భర్త సౌదీ అరేబియాలో పనిచేస్తున్నాడు మేడమ్! అక్కడనుంచి తెప్పించుకుందేమో మరి..."

"సీ- మిస్టర్! మీరు టెక్ట్స్ పుస్తకాలెలా తెచ్చుకుంటారో, ఎక్కడ తెచ్చుకుంటారో నాకనవసరం! టి.సి. తీసుకుపోండి...."

"ఈసారికి క్షమించండి మేడమ్! మేడమ్, మేడమ్? మేడమ్ ప్లీజ్ మేడమ్!"

"నో-నో-నో- యూ ఆర్ టూ ఎడొామెంట్- టి.సి. తీసుకుపోవాల్సిందే"

అందరం ఊపిరి బిగబట్టి వింటున్నాము. అతనిగొంతువిపించలేదీ సారి. కానీ హఠాత్తుగా "ధన్" మన్న శబ్దం వినిపించింది.

దానివెనుకే ఆవిడ కీచుగొంతు "కయ్" మంది

"ఛీ! వాటీజ్ దిస్, వాటీజ్‌దిస్ నాన్సెన్స్! మేరీ- మేరీ- రిమూవ్ హిమ్ ఫ్రమ్‌దిస్ ప్లేస్..."

మాకు అర్థమయిపోయింఇ, అతను రాజీకీయ నాయకులువాడే ఆఖరి అస్త్రం ప్రయోగించాడు. ఆమె కాళ్ళమీద పడిపోయాడు.

"అలా అనకండి మేడమ్! ఇప్పుడు ఇంకో స్కూల్లో చేర్చాలంటే మళ్ళీ కొత్తరకం యూనిఫారం, రెండువేలు డొనేషనూ- బాబోయ్ నావల్లకాదు మేడమ్ మీరు వప్పుకునే వరకూ మీ కాళ్ళు వదలను."

"ముందు కాళ్ళు వదులు-"

"నేను వదలను మేడమ్- టి.సి. ఇవ్వను అనేదాకా వదలను!"

"ఆల్‌రైట్! వచ్చే యూనిట్ టెస్ట్‌లో అయినా అన్ని సబ్జెక్ట్సులో పాస్ మార్కులు రాకపోతే టి.సి. ఇవ్వడం ఖాయం!"

"అలాగే మేడమ్!"

"అయితే ఇంక కాళ్ళువదులు!"

"థ్యాంక్యూ మేడమ్!"

"మేరీ!" ప్రిన్సిపాల్ గొంతు వినిపించింది.

"యస్ మేడమ్!"

"అక్కడ విక్స్‌డబ్బా ఉంటుంది- కొంచెం తెచ్చి నాకాళ్ళకు రాయ్-మరీ నొప్పి పుట్టేలా పట్టుకున్నాడు..."

"అలాగే మేడమ్!"

మా అందరిగుండెలూ ఝల్లుమన్నాయ్.

"ఆవిడ కాళ్ళు పట్టుకోవడం మరీ టూ మచ్!" అన్నాడు రంగారెడ్డి.

"ఒకళ్ళ సంగతేమో గానీ, గిసంటిపనులు నాతోని కాదు భయ్" చెప్పేశాడు యాదగిరి అయితే మేము కాళ్ళు పట్టుకోకపోయినా ఇంచుమించుగా అంత ఘోరంగానూ జరిగింది మా ఇంటర్వ్యూ!

అందరం వాచిపోయినా మొఖాలతో బయటకొచ్చాం.

హఠాత్తుగా యాదగిరి తన చైన్‌లోని చాకు తెరచి తన పన్నెండేళ్ళ కొడుకుని పొడిచేయడానికి వెంబడి పడ్డాడు. వాడు "అమ్మో, అమ్మో" అంటూ మా అందరి చుట్టూ తిరిగసాగాడు.

మేమంతా నానా హడావుడిపడి యాదగిరిని బలవంతంగా పట్టుకుని కత్తిలాక్కున్నాం.

"ఏమిట్రా! నీకేమయినా మతిపోయిందా కన్నపిల్లాడిని చంపుతానంటావేమిటి?"

"లేకుంటే ఏం కిరికిరి గురూ ఇది? ఇస్కీ మాకీ– వీడు పుట్టిన దగ్గర కెళ్ళి ఒకటే పరేషాన్, పరేషాన్ ఈడికి పాలడబ్బాలు కొననికి కిరికిరి! దేశమంతా తిరిగినంగానీ పాలడబ్బా మనగ్గావల్సినది దొరకదు ! బ్లాకులో కొనెడిదే! ఆడికెళ్ళి స్కూల్లో ఎడ్మిషన్ గురించి కిరికిరి! వెయ్యిరూపాయలు నగలు గిర్వికిపెట్టి తెచ్చి డోనేషను గట్టి లోయర్ కేజీల జేర్పించిన! ఈడు స్కూలుకి పోనికి రిక్ష! నీయవ్వ! ఈడి ఫీజు రెండొందలు! రిక్షా నాలుగొందలు! ఈడి యూనిఫారం బట్టగురించి వంద దుకాణాలు తిరిగినా ఆడకెళ్ళి ఈడి బూట్లు, టై నిజం చెప్తున్న భయ్! ఈ ఇద్దరు పిల్లగాండ్రిని సదివియ్యనికి పైసల్జాలక నేనూ, నా భార్య ఒక్క పొద్దే భోజనం చేస్తున్నం– గీపరిషాన్ల నేనుంటే గిప్పుడీ ప్రిన్సిపాల్ టి.సి. ఇస్తననబట్టే! ఏరా ఎందుకుర మార్కులు గన్ని తక్కువొచ్చినయ్యనడిగితే టెక్స్ట్ పుస్తకాలు తీస్కరమ్మంటడు! నీయవ్వ ఇంకేదయినా అంటే తెస్తంగానీ గీ టెక్స్ట్ పుస్తకాలు ఏడకెళ్ళి తేవాల? అదేం బంగారమా, వెండా– తేలిగ్గా దొరకనికి? ఛూ! నీయవ్వ – గిసంటి దేశంలో పిల్లల్నెవడువయ్యా కనమని చెప్పేడిది?"

"మేమంత నీతోపాటే బాధలు పడటం లేదేమిటి? అంతమాత్రన కత్తితీసుకుని పిల్లలను పొడిచేస్తున్నామా?" అన్నాడు రంగారెడ్డి. అందరం కాలనీకి చేరుకున్నాం.

"ఇలాక్కాదు గురూ! అందరం తలోవేపూ వెళ్ళి మొత్తం హైదరాబాద్ అంతా వెతికి వద్దాం టెక్స్ట్ పుస్తకాలెక్కడయినా దొరుకుతాయేమో!" అన్నాడు గోపాల్రావ్.

ఆ ఆలోచనలతో అందరూ ఏకీభవించారు. మర్నాడు శెలవుపెట్టి అందరం టెక్స్ట్ పుస్తకాల కోసం తలోదిక్కూ వెళ్ళాం! మధ్యాహ్నం తిరిగి వచ్చేసరికి శాయిరామ్ ఉత్సాహంగా ఓ విషయం చెప్పాడు.

"చార్మినార్ దగ్గర ఓ చిన్న షాపువాడు ముందే డబ్బిస్తే రెండు రోజుల్లో పుస్తకాలు తెప్పించి ఇస్తానంటున్నాడు."

"నాకూ ఓ ఫ్రెండ్ కనబడ్డాడు. వాడికి డబ్బిస్తే ప్రింటింగ్ ప్రెస్‌లో వాళ్ళ ఫ్రెండ్‌ద్వారా తెప్పిస్తాట్ట" అన్నాడు రంగారెడ్డి.

వెంటనే అందరం ఆలోచించి ఇద్దరికీ కట్టేద్దామని నిర్ణయించుకున్నాం! "ఇద్దరిలో ఏ ఒక్కరు పుస్తకాలు తెచ్చినా రెండోవారి దగ్గర ఆర్డర్ కాన్సిల్ చేసేయవచ్చు-" అన్నాడు జనార్ధన్.

వారంరోజులు గడిచిపోయినయ్. అయినా ఏ ఇక్కరూ టెక్ట్స్ పుస్తకాలు తేలేదు. ఆ రోజు అర్ధరాత్రి తలుపు తట్టారెవరో. నిద్రకళ్ళతో తలుపు తెరచాను.

ఎదురుగ్గా శాయిరామ్, రంగారెడ్డి, గోపాల్రావ్, యాదగిరి కనిపించారు.

"ఏమిటింత రాత్రిలో వచ్చారు?" అన్నాను నిద్రమత్తుతో.

"టెక్ట్స్ పుస్తకాలు! టెక్ట్స్ పుస్తకాలు దొరుతున్నాయట! త్వరగా పద!" అన్నాడు శాయిరామ్ రహస్యంగా నా నిద్రమత్తంతా వదిలిపోయింది.

"ఎక్కడికి?"

"ష్! అదంతా సీక్రెట్! ఆజమ్‌భాయ్ ఇప్పిస్తానంటున్నాడు!" అప్పటివరకూ నేను ఆజమ్‌భాయ్‌ని చూళ్ళేదు. వీళ్ళందరి వెనుకా నిలబడి ఉన్నాడు. ఆజమ్‌భాయ్ కూడా మా కాలనీ నివాసే! అతనికి ఆల్ఫాహొటల్ పక్కన చిన్నపుస్తకాల షాపుంది. మాంచి ఇంగ్లీషు మషాలా నవలలు అద్దెకిస్తూంటాడు.

నేను వెంటనే బట్టలు మార్చుకుని వాళ్ళతో బయలుదేరాను. అందరం అబిడ్స్ చేరుకున్నాం సైకిళ్ళమీద. అబిడ్స్ సెంటర్‌కి దగ్గర్లోనే ఉన్న ఇరుకు సందులు ఓ అరడజను తిప్పాడు ఆజమ్. చివరకు ఓ పాడుబడినట్లున్న మేడముందు నిలబడ్డాం.

"ఇగో, దేఖోభయ్! పోలీసులు గిట్టవచ్చి ఈడ ఎందుకు నిలబడిన్రు అంటే టెక్ట్స్ పుస్తకమ్ కర్‌కే బోల్‌నానై సమ్‌జెకినై?"

"సముజే-సముజే" అన్నాడు రంగారెడ్డి.

"మళ్ళా ఈడ ఎందుకు నుంచున్నావు అంటే ఏం జెప్తావ్?"

"ఏం జెప్పమంటావ్?" అతనినే అడిగాడు శాయిరామ్.

"సెకండ్ షో సినిమాదేక్‌కే ఆరహే హై కర్కేబోల్‌నా! సముజేకినై!"

"సముజే!" అన్నాడు రెడ్డి.

అయిదు నిమిసాలయిపోయింది. అందరం నిశ్శబ్దంగా దొంగల్లా నిలబడ్డాం.

"టెక్ట్స్ పుస్తకాలేకదా మనం కొనేది? దానికింత రహస్యం ఎందుకు?' నెమ్మదిగా ఆజమ్ భాయ్ పక్కన చేరి చెవిలో గుసగుసలాడాను.

"అరె బేవకూఫ్! ఇవి స్మగుల్డు టెక్ట్స్ పుస్తకాలు! మద్రాస్‌కెళ్ళి ప్రింటయి వచ్చింది. సముజే?"

"నహీసముజే!" అన్నాను మొఖవాటం లేకుండా

"అరె! క్యాదమాక్ హైజీ తుమారా? మన రాష్ట్రంలో టెక్ట్స్ పుస్తకాలు దొరకటంలేదని స్మగుల్డు వస్తువుల వ్యాపారం చేసేటోళ్ళు– టేప్‌రికార్డర్లు, వాచీలు, బట్టలు కాసెట్లు స్మగ్లింగ్ బంద్‌చేసి మన ఆంధ్రప్రదేశ్ టెక్ట్స్ పుస్తకమ్‌లు మద్రాసులో ప్రింట్ చేయించి బ్లాకులో యాభై రూపాయలకు ఎక్కువ రేటుతో అమ్ముతున్నయ్. కొన్ని పుస్తకమ్‌లు హాంకాంగ్, పాన్ నుంచి భీ స్మగ్లింగ్ హెూరైబోల్‌కే సునామై?"

మరో అయిదు నిమిషాలు గడిచినయ్.

లాల్చీపైజామా తొడుక్కున్న ఓ వ్యక్తి ఆ పాడుబడ్డ భవనంలో నుంచి టార్చిలైట్‌తో రోడ్డుమీద కొచ్చి అటూ ఇటూ రెండుసార్లు పచార్లు చేశాడు. అతన్తో ఏ కోడ్‌లో మాట్లాడాలో రంగారెడ్డికి ముందే నేర్పాడు ఆజమ్‌భాయ్–.

రంగారెడ్డి అతని దగ్గరకెళ్ళి "ఆకాశంలో పగలే నక్షత్రాలొచ్చాయ్!" అన్నాడు అతను ఓ క్షణం ఆగి "నిన్నరాత్రి సూర్యుడు కూడా వచ్చినయ్!" అన్నాడు, సిగరెట్ వెలిగించుకుంటూ! ఆ తరువాత ఏం చెప్పాలో రంగారెడ్డి మర్చిపోయినట్లుంది తన డయిరీ తీసి అగ్గిపుల్ల వెలుగులో చూసి "అగ్గిపుల్లకు ముళ్ళున్నాయ్" అన్నాడు. ఆ వ్యక్తి ముఖంలో సంతృప్తి కనిపించింది.

"ఎవరు పంపించారు మిమ్మల్ని?" అనడిగాడు.

ఆజయ్‌భాయ్ ముందుకొచ్చాడు "నిసార్‌మియా!"

"ఎంతమందిక్కావాలి టెక్ట్స్ పుస్తకాలు."

"పద్దెనిమిది సెట్లు!" చెప్పాడు శాయిరామ్.

"మద్రాసు ఎడిషన్‌లేదు! అవి లేకపోతే మా పిల్లలకు సంవత్సరం గోవిందా అవుతుంది!" అన్నాడు గోపాల్రావ్.

"అసలు రేటు మీద వందరూపాయలెక్కువవుతుంది!"

"వప్పుకుంటున్నాం గదా!"

"అయితే డబ్బివ్వండి!"

అందరం లెక్కచూసి డబ్బు అతనిచేతికిచ్చాం.

అతను ఆ భవనంలోకెళ్ళిపోయి పావుగంట తర్వాత పెద్ద "బండిల్" తో తిరిగివచ్చాడు.

"ఇదిగో పద్దెనిమిది సెట్లు! తెలుగు టెక్ట్స్‌లో అక్కడక్కడ ఒకటి రెండు చైనీస్ అక్షరాలు

వస్తే రావచ్చు. ఎడ్జస్ట్ చేసుకోండి! మళ్ళీ రిటర్న్ తీసుకోమంటే మాత్రం తీసుకునేది లేదు. వారం పదిరోజులు వీటిని స్కూలు కివ్వకండి! సరేనా?"

"సరే!"

అందరం అతనిని కౌగిలించుకుని ముస్లిమ్ పద్ధతిలో భుజాలు కలిపి, షేక్‌హాండిచ్చి కృతజ్ఞతలు తెలిపి కాలనీకి చేరుకున్నాం

తీరా మర్నాడు ఉదయానికి రంగారెడ్డి ఫ్రెండ్ మింట్‌కాంపౌండ్‌లో తన ఫ్రెండ్‌ద్వారా సంపాదించిన పుస్తకాల పార్సిల్ రిక్షాలో పంపించాడు. చార్మినార్ దగ్గర షాపులో ఎడ్వాన్స్‌గా కట్టిన డబ్బు తీసుకొచ్చేద్దామని వెళ్ళిన శాయిరామ్ మరో పార్సిల్‌తో తిరిగొచ్చాడు.

"పుస్తకాలు వచ్చేసినయ్ కనుక డబ్బువాపస్ ఇవ్వనన్నాడు ఆ షాపువాడు!" అన్నాడు శాయిరామ్ దిగాలుపడి.

ఈ ఎక్స్‌ట్రా పుస్తకాల బెడద ఎలా వదిలించుకోవాలా? అని అందరం చాలా భయంకరంగా ఆలోచిస్తూ కూర్చున్నాం. తీరా సాయంత్రం నాలుగయేసరికి మా కాలనీ పిల్లలంతా స్కూలు నుంచి వచ్చేశారు. అందరి చేతుల్లో టెక్స్ట్ పుస్తకాల పార్సెల్స్.

ఖంగారుపడి "ఈ పుస్తకాలెక్కడివి?" అడిగాం వాళ్ళను.

"మా ప్రిన్సిపాల్ ఎక్కడి నుంచో తెప్పించి మా అందరికీ ఇచ్చింది. రేపు డబ్బు పట్టుకొచ్చి కట్టమంది?" అన్నారు వాళ్ళు.

మూలిగేనక్కమీద కొన్ని వందలు తాటికాయలు వరుసగా గంటసేపు పడినట్లనిపించింది.

చివరకు ఆ రాత్రి అందరూ కలిసి ఓ తీర్పు ఇచ్చారు. నేనూ, శాయిరామ్ కలసి ఆ ఎక్స్‌ట్రా పుస్తకాలన్నీ ఓ రిక్షాలో వేసుకెళ్ళి ఓ పెద్ద స్కూలు బయట నిలబడి కావలసిన విద్యార్థులకు అమ్మివేయాలన్నదే ఆ తీర్పు సారాంశం. ఇష్టం లేకపోయినా, ఆపని ఎవరొకరు చేయక తప్పదు కనుక వప్పుకున్నాం– మర్నాడు పొద్దున్నే అనుకున్న ప్రకారం రిక్షా మాట్లాడి పుస్తకాలన్ని వేసుకుని మా కాలనీకి కొంచెం దూరంలో ఉన్న ఓ పెద్ద స్కూలు దగ్గరకెళ్ళి నిలబడ్డాం. మా వంక ఎవరూ చూడకపోయేసరికి శాయిరామ్‌కి గట్టిగా అరవకతప్పలేదు. "ఎవరికి మాస్టారూ టెక్స్ట్ పుస్తకాలు! టెక్స్ట్ పుస్తకాలెవరికండి! తాజా టెక్స్ట్ పుస్త–సారీ–సారీ–కొత్త టెక్స్ట్ పుస్తకాలు– గవర్నమెంట్ టెక్స్ట్ పుస్తకాలెవరికండీ బాబూ...."

నాలుగుసార్లలా అరిచేసరికి కొంతమంది కుర్రాళ్ళు వాళ్ళ తండ్రులూ మా రిక్షా చుట్టూ పోగయ్యారు. నాకు అలా పుట్‌పాత్ వ్యాపారం చేయడం చిన్నతనంగా ఉంది కాని తప్పదు కదా మరి!

అయితే శాయీరామ్ ఎందుకనో ఆవేషానికి భలే సూటయ్యాడనిపించింది. కొంతమంది టెక్ట్స్ పుస్తకాలు తిరగేసి చూశారు.

"జపాన్ ఎడిషన్ లేవా?" అడిగాడొకతను.

"లేవుసార్! ఇవే వున్నయ్!"

"అందులో పేపరు మంచిది వాడతారు! అందుకని అడుగుతున్నాను. కావాలంటే ఇంకో రెండ్రూపాయ లెక్కువ తీసుకుని జపాన్‌ని తెచ్చిస్తారా?"

"అయ్యా! మేము ఈ వ్యాపారం చేసేవాళ్ళం కాద్సార్! మా పిల్లలకు అనుకోకుండా మూడుసెట్లు కొనడం వల్ల అమ్మేస్తున్నాము.

"హలో ఉదయార్కర్" అని ఎవరో పిలవడంతో నాపై ప్రాణం పైనేపోయింది అతను మా ఆఫీసులోనే వర్క్ చేస్తుంటాడు.

"ఏమిటి ఉద్యోగం మానేశావా?" ఆశ్చర్యంగా అడిగాడతను.

"అబ్బేకాదు" అంటూ ఖంగారుగా చెప్పబోయానుగానీ అతను వినిపించుకోలేదు.

"ఓహో పార్ట్‌టైమ్ అన్నమాట! అవున్లే! స్మగ్లింగ్ బెస్ట్ బిజినెస్! ఎంతమంది ఇట్టే లక్షాధికారులయిపోలేదు? హాజీమస్తాన్ చూడు! మొదట్లో తిండిక్కూడా గడిచేదికాదుట–"

పావుగంటసేపు హాజీమస్తాన్ కథంతా చెప్పివెళ్ళిపోయాడతను.

"శాయీరామ్!" నీరసంగా పిలిచాను.

"ఏమిటి?"

"ఇలా లాభంలేదు గురూ! పిల్లల్ని స్కూల్‌దగ్గర డ్రాప్ చేయడానికి తల్లిదండ్రులొస్తారు చూడు! వాళ్ళని అడిగితే బావుంటుంది గానీ ఇలా అసహ్యంగా కేకలు పెడుతూ అమ్మటం నాకు బావుండలేదు" అన్నాను.

"నీ అయిడియా బాగానే ఉంది!" అన్నాడు శాయీరామ్. సరిగ్గా అప్పుడే ఓ పెద్దమనిషి స్కూటర్ మీద వచ్చి వాళ్ళ పాపను డ్రాప్ చేసి తిరిగి వెళ్ళబోతుంటే నేను పరుగుతో వెళ్ళి అడ్డం నిలబడ్డాను.

"మీ పిల్లలకు టెక్ట్స్ పుస్తకాలు కావాలా సార్?" అతను స్కూటర్ ఆపాడు "కావాలి!"

"రండిసార్! తీసుకోండి! రిక్షాలో ఉన్నాయ్! మేము కొన్నధరకే ఇచ్చేస్తున్నాం!"

"ఐసీ" అన్నాడతను స్కూటర్‌కి స్టాండ్‌వేసి రిక్షా దగ్గరకొస్తూ. పుస్తకాలన్నీ చూశాక "ఇవ్వన్నీ కొంటాను ఇస్తారా?" అనడిగాడు. శాయీరామ్, నేనూ ఆనందంగా మొఖాలు చూచుకున్నాం.

"ఇస్తాం సార్! అంతకంటె కావల్సిందేముందీ?"

"అయితే నా వెంబడే రానీండి రిక్షా" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడతను. రిక్షా స్కూటర్ వెనకేపోతోంది. మేము సైకిల్ మీద బయల్దేరాము. "వీడెవరో స్మగ్లర్‌లాగున్నాడు! ఈ పుస్తకాలన్నీ మామూలు రేటుకి కొనేసి– బ్లాకులో అమ్ముకుంటాడు కాబోలు!" అన్నాను శాయీరామ్‌తో

"ఇంకా అనుమానమెందుకూ? బ్లాక్ మార్కెట్ బిజినెస్ చేయబట్టే ఆ స్కూటర్ కొనగలిగాడు!" అన్నాడు శాయీరామ్. "ఇక్కడ ఆపు!" అన్నాడతను రిక్షావాడితో. రిక్షా ఆగింది.

"ఫోర్ నాట్ త్రీ– ఆ రిక్షానీ, వాళ్ళిద్దరినీ లోపలకు తీసుకు పద!" అంటూ అరిచాడు. ఉలిక్కిపడి చూచాము. ఎదురుగ్గా పోలీస్‌స్టేషన్! ఓ కానిస్టేబుల్ బయటకొచ్చి "లోపలకు పదండి!! అన్నాడు కర్కశంగా. ఆ షాక్ నుంచి తేరుకోకముందే మమ్మల్ని లోపలకు తీసుకెళ్ళి లాకప్‌లో పడేశాడు. ఫోన్‌లో మమ్మల్ని తీసుకొచ్చిన స్కూటర్‌వాలా గొంతు భయంకరంగా వినబడుతోంది.

"హలో సార్! యెస్పీగారా సార్! గుడ్ మాణింగ్ సార్! నేను సి.ఆయ్.డి. ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావ్‌ని మాట్లాడుతున్నాను. టెక్స్ట్ పుస్తకాల స్మగ్లింగ్ కేసు పట్టేశాను సార్! చాలా పెద్ద రాకెట్ సార్ అది! ఇద్దరు వ్యక్తుల్నీ, రిక్షాడు పుస్తకాల్నీ కాన్‌ఫిస్కేట్ చేసేశానండీ!... మన రాష్ట్రంలో జరుగుతున్న ఈ స్మగ్లింగ్ వ్యవహారంలో ఇదే పెద్ద ముఠా సార్...."

మాకు క్రమంగా స్పృహ తప్పసాగింది.